
రోడ్డు మీద
బొమ్మవేసి బ్రతికే
అతను వేసిన
ఆఖరి చిత్రం!

# రంగుల రాగం





అందరికి నడిచే రోడ్డయినా శేషయ్యకు మాత్రం అది కేన్వాసు గుడ్డ! కేన్వాసు గడ్డమీద పెయింట్ వేస్తొంటే కుంచె ఎంత సుఖంగా కదులుతుందో నల్లటి ఆ సిమెంట్ రోడ్డుమీద అతడి చేతిలోని రంగు సుద్దలుకూడా అంత సుఖంగానూ చురుకుగానూ కదులుతున్నాయి.

ఇంద్రధనుస్సులోని రంగులు నేలమీదికి దుమికి నాలుగువైపులా ప్రవహించి పరవళ్లు తొక్కుతున్నట్టు అతడు చిత్రించే ఆ చిత్రం ఒక సుందర దృశ్యంగా రూపుదిద్దుకుంటోంది. బంగారంలాంటి ఎండ ఆ బొమ్మమీద పడి దానికి మరింత శోభని చేకూరుస్తోంది.

ఆ సమయంలో - నగరంలో రోడ్లమీది జనం అంతా ఆలస్యంగా నిద్రలేచినవాళ్లలాగా హడావుడిపడుతూ వడివడిగా అడుగులేస్తూ నడుస్తున్నారు. వాహనాలున్నవాళ్లు నడిచే వాళ్లకన్నా ఎక్కువ తొందరపడుతున్నట్లు కనిపిస్తున్నారు. స్కూలు పిల్లల రిక్షాలు, ఆటోలు, స్కూలు బస్సులు - రకరకాల రంగుల పిట్టల్ని పంజరాల్లో పెట్టి అమ్మకానికి తీసుకుపోతున్నట్టు పరుగులు పెడుతోంటే వాటిల్లో పిల్లలు పిట్టల్లాగానే కేరింతలు కొడుతూ రొదచేస్తున్నారు. బస్సు స్టాపుకు సమీపంలో ఒక పక్కగా రోడ్డును 'కబ్జా' చేసి సుద్దముక్కలతో బొమ్మను పూర్తిచేశాడు శేషయ్య. చివరగా 'హెల్ప్', 'ధర్మం' అని రెండు భాషల్లోనూ రాశాడు.

తీరుబడిగా నిలబడి, అతడి కళాకౌశలాన్ని పరికించే వ్యవధి నిజానికి ఆ టైములో ఎవరికీ లేదు. ఉపాధులు ఉన్నవాళ్లు వాటిని నిర్వహించుకోవడానికి, లేనివాళ్లు వాటిని వెతుక్కోవడానికీ పరుగులు పెట్టే సమయం అది. విధులు లేక, అవి దొరికే విధానంలేక వీధుల్లో తిరిగే ఒకరిద్దరు మాత్రం నిలబడి ఆ చిత్రాన్ని



చూస్తున్నారు. డబ్బుల్లేనివాడు ఓడముందెక్కినట్టు వాళ్లెంత సేపు చూసినా పైసా రాలదు. వాళ్ల పెప్పుకోలు శేషయ్యకవసరమూ లేదు.

సాయంత్రంవరకూ ఓపిగ్గా కాచుకుని కూర్చుంటేే తప్ప ఆ రోజుకి సరిపడా డబ్బులు రాలవు. అంతదాకా బొమ్మ చెరిగిపోకుండా, ఎవరూ తొక్కకుండా చూసుకోవాలి అనుకుంటూ బొమ్మకి అవతలివైపున నాలుగురాళ్లు పెట్టాడు

శేషయ్య. ఆ రాళ్లే కొంపముంచాయి.

బొమ్మమీద అంతకుముందే పడివున్న నాలుగైదునాణేలవంక చూస్తూ శేషయ్య లెక్కలు వేసుకుంటున్నసమయంలో అక్కడ రక్షణగా పెట్టిన ఓ రాయి కాలికి తగిలి ఓ ఆరేళ్ల స్కూలుపిల్ల బోర్లా పడిపోయింది!

ఆ పిల్ల చేతిలో వున్న వాటర్ బాటిల్ మూత ఊడిపోయి బొళబొళా నీళ్లన్నీ బొమ్మమీద వొలికిపోయాయి.

శేషయ్య తుళ్లిపడి ఈ లోకంలోకి వచ్చి చూసుకునేసరికి మూడు వంతుల బొమ్మ తడిసిపోయింది. పిల్ల ఏడుపు లంకించుకుంది.

పక్కనే నడుస్తున్న మిగిలిన పిల్లలు ఆమెను లేవదీసి, స్కూల్ డ్రస్సుకి అంటిన దుమ్ము దులిపి ఆమెను ఓదార్చబోయారు.

శేషయ్య తను పొద్దుట్నుంచీ పడిన శ్రమంతా నీటిపాలైపోయినందుకు గుండె రగులుకుపోయి ఆవేశంలో ఆ పిల్లని చెయ్యి చేసుకోబోయాడుకానీ, ఆమె కాలికి తగిలిన గాయం రెడ్‌లైట్‌లాగా ఎర్రగా కనబడేసరికి తగ్గేడు.

ఆ పిల్ల ఇంకా ఏడుస్తోంది.

తప్పదన్నట్టు శేషయ్య లేచివెళ్లి ఆ పాప కాలిగాయాన్ని చేత్తో శుభ్రం చేసి, ''దెబ్బతగిలిందా? తగ్గిపోతుందిలే ఏడవకు!'' అన్నాడు లేని సహనం తెచ్చుకుని.

పాప కళ్లు తుడుచుకుని గుటక వేసింది. ''నాకు దెబ్బ తగిలినందుక్కాదు. నీ బొమ్మ తడిసిపోయిందికదా... అందుకు!''

చిన్నగా ముద్దుగా భయపడుతూ అంది ఆరేళ్ల హసిత!

శేషయ్య కళ్లల్లో సన్నటి నీటి పొర ఎండ పడి తళుక్కున మెరిసింది. ఆమెను చటుక్కున అక్కున చేర్చుకున్నాడు!

★ ★ ★

బిచ్చగాళ్లు గుంపుగా రోడ్డువార నడుస్తూ వెడుతున్నారు. బండ్లలో కుష్టురోగులూ, వాళ్లని నడిపించేవాళ్లు, అంగవైకల్యం ఉన్నవాళ్లు, పిల్లల్ని ఎత్తుకున్న బిచ్చగత్తెలు నానారకాలూ వున్నారందులో.

''ఏరా శేసయ్యా నువు రావా బోజినానికీ?'' గుంపులో ఒకడు తలతిప్పి శేషయ్యనడిగేడు.

శేషయ్య తలపైకెత్తలేదు. బొమ్మగీయడంలో మునిగిపోయాడు.

''నిన్నేరా శేసయ్యా! ఇంద్రాగాంధీ పుట్టిన్రోజంట, గాందీ బొమ్మకాడ సంతర్పనెడుతన్నారు... బేగీరా!''

శేషయ్య తలెత్తకుండానే 'సరే'నన్నట్టు తలాడించాడు.

ఏ బిచ్చగాడూ సంతర్పణ భోజనాన్ని వదులుకోడు. వాళ్లందరికిలాగానే శేషయ్యకి కూడా ఆకలితో కడుపు కాలుతోంది.

మామూలుగా అయితే తనూ వెళ్లేవాడే! కానీ రోడ్డుకవతల స్కూలునుంచి లంచ్ టైములో రోజూ వచ్చే పాపకోసం ఎదురుచూస్తున్నాడు తను. హసిత వచ్చి శేషయ్య వేసిన బొమ్మను చూసి మెచ్చుకోవడమో, విమర్శించడమో చేస్తుంది.

బాగుంటే హబ్బ... ఎంత బావుందో అంటుంది. లేకపోతే బొమ్మలతాతా... నువ్వు ఇంత పెద్దాడివికదా... ఇంత గెడ్డం వున్న పెద్దాడివికదా... ఇంత చిన్న బొమ్మ వెయ్యలేవా? షేమ్ షేమ్!'' అంటూ వెక్కిరిస్తుంది. డ్రాయింగు బుక్కులో తనువేసిన బొమ్మలు చూపిస్తుంది గర్వంగా. బాగున్నాయుని శేషయ్య మెచ్చుకుని ముద్దు పెట్టుకుంటే ''ఛీఛీ నీ దగ్గర చెమట కంపు! గెడ్డం గుచ్చుకుంటోంది దూరంగా వుండు!'' అంటూ కోప్పడుతుంది. ఒక్కొక్కసారి ''నాకన్నా నువ్వే

బొమ్మలు బాగా వేస్తావు... నాకు నేర్పవా తాతా?'' అని బ్రతిమలాడుతుంది.

ఆమె ఎలా మాట్లాడినా అతడికి ఆనందమే! ఆ చిన్నారి ముద్దులొలికే మాటలు రోజూ ఆ టైములో వినకపోతే అతడికి ఏదో వెలితిగా వుంటుంది. స్కూలుకుగాని సెలవొస్తే ఆరోజు గడవదు శేషయ్యకు.

''తాతా... తాతా...'' అంటూ ఆప్యాయంగా పాప పిలుస్తోంటే అతడి హృదయం అంతా ఆనందంతో నిండిపోతుంది. ఒకపక్క సమాజం 'ముష్టివాడ'ని హీనంగా తిట్టిపోస్తూ దూరంగా నెట్టివేస్తోంటే కల్మషం తెలియని ఆ చిన్నారి, అంతరాలకు అతీతంగా చేరువై ఆ ముసలివాణ్ణి చిత్రమైన అనుబంధంతో కట్టిపడేసింది.

★ ★ ★

ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ వచ్చే హసిత ఆరోజు నిరుత్సాహంగా కనిపించింది శేషయ్యకి.

''ఏవమ్మా... ఏవయిందీ? టీచరమ్మ కొట్టిందా?'' మామూలు ధోరణిలో అడిగేడు శేషయ్య.

''కాదుతాతా! మరేమో... ఎల్లుండి స్కూల్డే కదా! అందుకని డ్రాయింగ్ పోటీ పెట్టారు''

''పెడితే మంచిదేగా''

''మరి నా డ్రాయింగ్ పెన్సిల్సు పోయాయి. మా మమ్మీకి చెబితే కొడుతుంది'' ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి.

''మరేం చేద్దాం తల్లీ?''

''బొమ్మ వేయకపోతే మా టీచరుకూడా కొడుతుంది!'' ఏడుపు ప్రారంభించింది హసిత.


శేషయ్య కరిగిపోయాడు.

''ఏడవకు నాన్నా! రంగు పెన్సిళ్లేకదా... నేను కొనిస్తాలే! ఎవరికీ చెప్పకు... ఏం?'' అన్నాడు ఆమె కళ్లు తుడిచి.

తను పాపతో మాట్లాడుతున్నప్పుడు ఆమె తాలూకు వాళ్లెవరైనా చూస్తే ఇక ఆమెను తన దగ్గరకు రాకుండా చేసేస్తారని ఎప్పుడూ భయపడుతూ వుంటాడు శేషయ్య.

''మరీ... పెన్సిళ్లు కొందాంకానీ... ఏం బొమ్మ వేస్తావ్? నువ్వేది బాగా వెయ్యగలవూ?''

''నాకొచ్చిన బొమ్మకాదు తాతా! కొత్త బొమ్మ వెయ్యాల్ట! మా టీచరు చెప్పింది! తాతా తాతా నువ్వు ఓ మంచి బొమ్మ నాకు నేర్పించవా? ప్లీజ్!'' చెయ్యి



పట్టుకుని కుదుపుతూ బ్రతిమాలింది.

శేషయ్యలో సంతోషం, గర్వం రెండూ తొంగిచూశాయి.

★ ★ ★

చిన్న పిల్ల బాధ చూడలేక రంగు పెన్సిళ్లు కొంటానన్నాడు.

నిజానికి కూటికి గతిలేక ఏ పూటకాపూట తిండి వెతుక్కునే శేషయ్య వాటినెలా కొనగలడు? ఎన్ని డబ్బులు పెట్టాలో తెలియదు. పది రూపాయలన్నా పెడితేగాని అవి రావేమో! వుంటే తిని, లేకుంటే పస్తుండే తను ఒక్కరోజులో తప్పనిసరిగా పదిరూపాయలు సంపాదించి తీరాలంటే ఎట్లా? బుర్ర గోక్కుని గడ్డం పీక్కున్నాడు శేషయ్య. విచిత్రమైన సమస్య! ఇది తోటి యాచకులకు చెబితే వాళ్లు తిట్టిపోస్తారుకూడా! ఎలా? మర్నాడు ఉదయం లేస్తూనే రోడ్డు శుభ్రం చేసేసి తన శక్తియుక్తులన్నీ ధారపోసి అద్భుతమైన ఓ చిత్రాన్ని గీశాడు శేషయ్య. చాలా సమయం పట్టింది పూర్తిచేయడానికి. ఎలాగైనా సరే సాయంత్రానికి బొమ్మమీద పది రూపాయలు పడితీరాలని పట్టుదలగా శ్రమపడి వేశాడు. చివర చివర 'హెల్ప్' అని రాసేక అప్పుడు గుర్తుకొచ్చింది - ఆ రోజు ఆదివారం! ఆఫీసులకీ, మార్కెట్లుకీ సెలవు! అంటే... ఒక్క పైసాకూడా రాలదన్నమాట!

★ ★ ★

ఆ రాత్రి నిద్రపట్టలేదు శేషయ్యకి. తెల్లారగానే పాపకి ఏం చెప్పాలి? రంగు పెన్సిళ్లు కొనిస్తానని చెప్పి తీరా లేవంటే ఏడవదూ? ఆమె ఏడిస్తే తను చూడగలడా?

ఏమైనా సరే పొద్దున్న పది రూపాయలు సంపాదించాలి! ఎలా?

తెల్లారిపోయిందిగానీ సమస్యకు పరిష్కారం దొరకలేదు.

పక్క వీధిలో బిచ్చగాళ్లుండే చోటుకెళ్లి వాళ్లని బ్రతిమలాడితే కుంటి వెంకట్రావుదగ్గర నాలుగు రూపాయల అప్పు పుట్టింది. రోజుకో రూపాయి చొప్పున ఐదు రూపాయలు తిరిగి చెల్లించే షరతుమీద. ఆ మధ్య ఓ రెడ్డిగారు తన తండ్రి పుట్టినరోజు 'ధర్మం' అని పేరు అచ్చువేసిన బనియన్లు బిచ్చగాళ్లందరికీ పంచిపెట్టాడు. తనకిచ్చిన బనియన్ని ఇంతవరకూ తొడుక్కోకుండా దాచుకున్నాడు శేషయ్య. దానిని ఒకడికి అమ్మితే మూడు రూపాయలొచ్చాయి.

హసిత వచ్చేసరికి రోడ్డుమీద తన చిత్రం మీద మరో రూపాయిద్దాకా చిల్లర పడింది. వాటితో కలిపి మొత్తం ఎనిమిది రూపాయలవరకూ జమ అయినట్టు.

ఆమెను వెంటబెట్టుకుని దగ్గర్లో వున్న ఓ స్టేషనరీ దుకాణానికి వెళ్లి ఆరు రంగులున్న ఓ చిన్న పెన్సిళ్ల సెట్టు కొన్నాడు శేషయ్య. కొద్దిగా డబ్బులు మిగిలితే తనకోసం రంగు సుద్దలు కొనుక్కున్నాడు.

''నేను కొనిచ్చినట్లు ఎవరికీ చెప్పకేమ్మా?'' మెల్లగా రహస్యంగా చెబుతున్నట్లు చెవిలో చెప్పాడు.

''చెప్పనుగానీ... మరీ... ఏం బొమ్మ వెయ్యను తాతా? మా ఫ్రెండ్స్ అందరికంటే నేను బాగా వెయ్యాలి! మంచి బొమ్మ నేర్పవా?'' నోరు చిన్నగా చేసి అభ్యర్థించింది.

శేషయ్య గడ్డంలో వేళ్లు తిప్పుతూ ఆలోచించాడు.

పాప దగ్గరున్న రఫ్ పుస్తకంలో రంగు పెన్సిళ్లతో నాలుగు కొండలు, వాటి మధ్యలో ఉదయిస్తున్న సూర్యుడు, పక్కగా రెండు కొబ్బరిచెట్లు, కొండల ముందుగా నీళ్లు ఉన్నట్లు నాలుగు గీతలు గీసిచ్చాడు.

హసితకి తృప్తి కలగలేదు.

''ఇలా వేస్తే నాకు రాదు తాతా! నువ్వు

రోడ్డుమీద పెద్దగా వెయ్యి! నేను చూసి నేర్చుకుని మా స్కూల్లో వేస్తా.... ఏం?'' ఆశగా కళ్లింత చేసుకుని అడిగింది.

''ఇప్పుడా? ఇప్పుడెలాగమ్మా? నీ స్కూలు టైమైపోయింది. పోనీ ఓ పనిచేద్దాం! రేపు నువ్వు స్కూలుకు వెళ్లేటప్పుడు రా! అప్పటికి చక్కగా వేసి వుంచుతా! చూసి వేసేద్దువుగాని... ఏం?''

హసిత ఒప్పుకుంది.

★ ★ ★

రోజూ జనాన్ని ఆకర్షించడానికి వినాయకుడో, హనుమంతుడో, కృష్ణుడో, ఏసుక్రీస్తో - ఇలా దేవుళ్ల బొమ్మలు వేసేవాడు శేషయ్య. కాని ఆరోజు మొదటిసారిగా ఓ ప్రకృతి దృశ్యం వెయ్యాలి తన చిన్నారి హసితకోసం.

ఈ చిత్రానికి ప్రజలు 'హెల్ప్' చేయకపోవచ్చు. చేయకపోయినా ఫరవాలేదు. పాపకోసం తనొకరోజు పస్తున్నా ఫరవాలేదనుకున్నాడు శేషయ్య.

తెల్ల సుద్దముక్కతో ముందుగా స్కెచ్ వేసుకున్నాడు.

రంగుముక్కల్తో బొమ్మని ప్రారంభించబోతూ వుంటే వచ్చేడొక కానిస్టేబుల్.

''ఏరా తెల్లారిందా అప్పుడే? తెల్లారడం పాపం! రోడ్డంతా ఆక్రమించేసి గీతలు గీసెయ్యడం! ఈ రోడ్డేవన్నా నీ బాబుగాడి సొమ్మేంట్రా? లే!'' లాఠీతో నేలమీద కొట్టి ఒక్క కసురు కసిరేడు కానిస్టేబుల్.

శేషయ్యకిది మామూలే! అతడు మాట్లాడలేదు.

అభ్యర్థనగా తలెత్తి చూశాడు.

''కన్నాలేసేవాళ్లా ఆ చూపేంట్రా? మధ్యాహ్నం స్కూలుకి మినిస్టర్‌గారొస్తున్నారు. రోడ్డంతా క్లీన్‌గా వుండాలి. ఊఁ... కదులు!''

ఇంతలో మరో పదిమందిదాకా పోలీసులొచ్చి అన్నివైపులా సర్దుకున్నారు. రోడ్లు తుడిచేవాళ్లు, జండాలు, బేనర్లు కట్టేవాళ్లు బిలబిలా వచ్చారు.

ఇక ఆరోజు అక్కడ బొమ్మవేసే పరిస్థితి ఏమాత్రం లేదు. హసితకి బొమ్మవేసి చూపించలేని తన నిస్సహాయ స్థితికి తనని తానే నిందించుకున్నాడు శేషయ్య.

స్కూల్ బస్ ఆగగానే పరిగెట్టుకొచ్చింది హసిత.

''తాతా! ఏదీ బొమ్మ? ఎక్కడేశావ్?''

## విశ్రాంతి

''ఈ ఉద్యోగం నీకు ఇచ్చావే అనుకో నువ్వు చేసే మొదటిపని ఏమిటి?'' అడిగాడు ఆఫీసర్.

''ఇంటర్వ్యూలకు తిరిగి తిరిగి వున్నానుకదా.. ముందు విశ్రాంతి తీసుకుంటానండి'' చెప్పాడు అభ్యర్థి.

-మాడిశెట్టి బ్రదర్స్ (నరసరావుపేట)



శేషయ్య నీళ్ల నమిలాడు.

"సాయంత్రం మీ స్కూలుకి ఎవరో మినిస్టరుగారొస్తున్నారటకదమ్మా... అందుకని రోడ్డుమీద పోలీసులు నన్ను బొమ్మ వెయ్యనీలేదమ్మా! నేను వెయ్యకపోతే ఏం? నువ్వు నాకంటే బాగా వేస్తావు కదమ్మా?"

హసితకి కోపం వచ్చి మూతి బిగించేసింది. ఆమెకు నచ్చచెప్పి, బొమ్మ ఎలా వెయ్యాలో కళ్లకి కట్టినట్టు వివరించి ధైర్యం చెప్పి పంపించేసరికి తలప్రాణం తోకకొచ్చింది శేషయ్యకి.

ఆరోజు తనకింక పనిలేదు. పస్తే! పోలీసుల దృష్టినుంచి దూరం జరిగి ఫుట్‌పాత్‌మీద ముడుచుక్కూర్చున్నాడు.

జేబులో కొద్దిగా చిల్లరుంది. వాటితో ఓసారి టీ తాగొచ్చు అనుకున్నాడు. కాని తాగబుద్ధి కావడంలేదతనికి. పాపకోరిన బొమ్మ వేయలేకపోయినందుకు తీవ్రంగా మదనపడసాగాడు.

మధ్యాహ్నం లంచ్ టైములో హసిత వచ్చింది. ఆమె మొహం ఆనందంతో వెలిగిపోతోంది.

"తాతా... తాతా బొమ్మ చాలా బాగా వేశా తాతా! నాకే ఫస్టు వస్తుందని మా టీచరు చెప్పింది! సాయంత్రం మినిస్టరుగారు నాకు పెద్ద ప్రైజిస్తారట! తాతా బొమ్మ నాకు నువ్వే నేర్పావుకదా! ఆ ప్రైజు నీకిచ్చేస్తా! నిజం... ఒట్టు!" ఏదో చెబుతోంది హసిత హుషారుగా.

ఆమె మాటలకు సంతోషం పట్టలేక ఏడ్చేశాడు శేషయ్య. గొంతు బొంగురు పోయింది. భార్యాబిడ్డలు, రక్తసంబంధాలు, మమకారాలు తెలియవతడికి. ఆ చిన్నారితో తన అనుబంధం ఓ వరం అనుకున్నాడు. పూర్వజన్మలో తను చేసుకున్న పుణ్యం ఇంకా మిగిలి వుందనుకున్నాడు.

ఆమెను దగ్గరకు తీసుకుని "ఈ క్షణంలో ఇలాగే ఈ చిన్నారి కాళ్లదగ్గర తన ప్రాణం పోతే ఎంత బాగుండును?" అనుకున్నాడు. ఆమె అరచేతుల్ని ముద్దాడేడు. ఆమె గుండెలమీద తల ఆన్చి "జీవితంలో ఇంతకన్నా ఆనందకరమైన క్షణాలున్నాయా?" అని ప్రశ్నించుకున్నాడు.

"ఏడుస్తున్నావా తాతా? ఎందుకు? పోలీసులు కొట్టేరా?" అమాయకంగా అడిగింది హసిత.

"లేదమ్మా... మరి నువ్వు బొమ్మ బాగా వేశావుకదా! బహుమతిస్తారుకదా!..." ఎలా చెప్పాలో అర్థంకాలేదు శేషయ్యకి.

"టైమయిపోతోంది. నే వెళ్లిపోతా తాతా! సాయంత్రం ఇక్కడే కూర్చో! ఎక్కడికీ వెళ్లకేం? వెళ్లావంటే నీతో అస్సలు మాట్లాడనంతే!"

ఆమె రోడ్డుదాటి వెళ్లేదాకా అలాగే చూస్తూ కూర్చున్నాడు శేషయ్య.

★ ★ ★

పేదవాళ్లని పట్టించుకోకుండా, లోకంలో ధనవంతులంతా తమ గురించి, తమ బాగు గురించే చూసుకుంటూ మరింత పైకి ఎదగాలని ఆలోచిస్తూ ఉన్నట్టే, రోడ్డుమీద వాహనాల్లో పోయేవాళ్లు కూడా పాదచారుల్నీ, సైకిళ్లమీద వెళ్లేవాళ్లనీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు దూసుకుపోతున్నారని ఉదయంనుంచి రోడ్డుమీద అటూ ఇటూ పోయే ట్రాఫిక్ వైపే చూస్తూ కూర్చున్న శేషయ్యకి అనిపించింది. వెంటనే తన వెర్రి ఆలోచనకు తానే నవ్వుకున్నాడు.

ఆ సమయానికి రోడ్డుకవతల స్కూలులో ఉత్సవం జరుగుతోంది. లోపల మంత్రిగారున్నారు. అందుచేత స్కూలు సమీపంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. స్కూలు గేటు దగ్గరున్న పోలీసులు ఇతరులెవర్నీ అక్కడ నిలబడనీయటంలేదు. చింపిరి బట్టలతో తనలాంటివారినైతే తరిమి తరిమి కొడతారని తెలిసి శేషయ్య రోడ్డుదాటే ప్రయత్నం చేయకుండా

తనుండే చోటునుంచే స్కూలువైపు చూస్తూ కూర్చున్నాడు.

ఏ క్షణంలోనైనా ఉత్సవం అయిపోవచ్చు. మంత్రిగారు వెళ్లేక హడావుడి తగ్గితే పాప వస్తుంది. తనకొచ్చిన బహుమతి చూపిస్తుంది. అప్పుడు తను ఆమెను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకోవడం తప్ప ఆమెకేం ఇవ్వగలడు? ఆమెకోరిన విధంగా బొమ్మకూడా వేయలేకపోయాడు తను. ఆ చిన్నారి నిరుత్సాహంగా వెళ్లింది స్కూలుకి. పోలీసులు అడ్డు తగలకపోతే తను శ్రమ పడి అయినా పాపని మెప్పించేలా చిత్రం వేసేవాడే! మరోసారి నిరాశా నిస్పృహలు శేషయ్యని కమ్మేశాయి.

ఇలా వుండగా - అక్కడ స్కూలులో మంత్రిగారు ఉపన్యాసం ఇచ్చి, ఆ తర్వాత పిల్లలకు బహుమతులు పంచిపెట్టారు.

హసితకు డ్రాయింగులో ఫస్టు ప్రైజు వచ్చింది. ఆమె చేతిలో పెట్టిన వెండికప్పుకంటే కొన్ని రెట్లు ఎక్కువగా ఆమె మొహం కాంతివంతంగా వెలిగిపోతోంది.

బహుమతి పుచ్చుకున్న వెంటనే స్టేజిమీదనుంచి దిగి పరుగెట్టింది. బయటికొచ్చి ఆ వెండికప్పుని తాతకి కానుకగా ఇవ్వాలని ఆమె ఆరాటం.

ఆఫీసులు వదిలే సమయం కావడంచేత రోడ్డుమీద ట్రాఫిక్ రద్దీగా వుంది. వాహనాలువేగంగా అటూ ఇటూ ప్రవాహంలా వెళ్లిపోతున్నాయి.

ఎంత త్వరగా వెళ్లి ఆ కప్పు తాత చేతిలో పెడదామా అనే ఉత్సాహంలో హసిత స్కూలు గేటుదాటి ఒక్క పరుగులో రోడ్డుమీదకు వచ్చేసింది.

రోడ్డు మధ్యకొచ్చేసి ట్రాఫిక్ మధ్యలో ఇరుక్కుపోయి తనమీదకి భూతంలా వచ్చేస్తున్న ఓ ఆటోని చూసి కెవ్వుమని కేకపెట్టి నిలబడిపోయింది.

ఆ కేక రోడ్డుకవతల వున్న శేషయ్య చెవుల్లో మోగింది.

జగరబోతున్న ఘోరం శేషయ్య కళ్లబడింది.

''పాపా!'' గట్టిగా అరిచి ఒక్క ఉదుటున రోడ్డుమీదకొచ్చేశాడు శేషయ్య గజేంద్రుణ్ణి రక్షించే విష్ణుమూర్తిలాగా క్షణం కూడా ఆలస్యం చేయకుండా.

ఎవరినెవరు రక్షిస్తారో ఎవరికి తెలుసు?

పాపమీదికి రాబోయిన ఆటో అరక్షణంలో

## లాలూ కోరిక



ఒకవేళ నేషనల్ ఫ్రంట్ అధికారంలోకి వస్తే లాలూ ప్రసాద్ యాదవ్ ప్రధానమంత్రి అవుతారా? ఇదే ప్రశ్న లల్లూగార్ని అడిగినప్పుడు ''వి.పి. సింగ్ నా నేత! ఆయన్ని ఇంకోసారి ప్రధానిగా చూడాలని వుంది. ఒకవేళ ఆయన నన్నే వుండమని బలవంతం చేస్తే నాకు అభ్యంతరం లేదు'' అన్నాడాయన! పాపం పగటికలలు కంటున్న లాలూగారి ఆశలు నిజం అయ్యేరోజు వచ్చేనా? ఏమో చెప్పలేం! మన దేశంలో ఏమయినా జరగవచ్చు - సో బెస్టాఫ్ లక్ టూ లాలూ ప్రసాద్ జీ!

- జూపిటర్

ప్రమాదం పసిగట్టి కీచుమంటూ శబ్దం చేసి పక్కకు మళ్లింది. దారుణమైన దుర్ఘటన తృటిలో తప్పింది.

భయంతో కళ్లుమూసుకుని స్థాణువులా నిలబడిపోయి ఏడుస్తున్న హసితను స్కూలు గేటు దగ్గర అంతవరకూ ఏమరుపాటుగా వుండి అప్పుడే గమనించిన పోలీసులొచ్చి చటుక్కున ఎత్తుకున్నారు. ఆ వెంటే పరుగుమీద వచ్చి స్కూలు 'ఆయా' పాపను తీసుకుని గుండెలకు హత్తుకుంది.

అవతలివైపు పాపని రక్షించడానికి వెనకా ముందూ చూసుకోకుండా రోడ్డుమీదకి దూకిన శేషయ్య మాత్రం తనను తాను రక్షించుకోలేకపోయాడు.

ఓ జీపు వేగంగా వచ్చి గుద్ది అతణ్ణి దారుణంగా బలితీసుకుంది. విల్లులాగా ఒకసారి వంగి రక్తపు మడుగులో తుదిశ్వాస విడిచాడు శేషయ్య!

పాప ప్రాణంకోసం తన ప్రాణం బలిపెట్టాడు.

ఆయా చేతుల్లో ఏడుస్తున్న పాప ''తాతకావాలి! తాతదగ్గరకెడతా!'' అంటూ రోడ్డుకవతలివైపు చూపిస్తోంది. వీపుమీద రెండు దెబ్బలు తగిలించి, ఆమె చెప్పేది వినకుండా స్కూల్లోకి తీసుకుపోయింది ఆయా!

రోడ్డుమీద ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు వాహనాలను దారిమళ్లించడం ప్రారంభించారు.

జీపుకింద ప్రాణరహితంగా పడివున్న శేషయ్య శరీరంనుంచి, గుండెల్లోంచి ప్రవహిస్తున్న వేడి రక్తం ధారలుగా రోడ్డుమీద పల్లంలోకి పాకుతోంది.

నిజంగా హసిత వచ్చి అటూ ఇటూ ప్రవహించి విస్తరిస్తున్న ఆ రక్తధారలను చూడగలిగితే అది శేషయ్య గీస్తున్న ఎర్రని చిత్రంగా తోచి వుండేది. ఆ చిత్రంలో ఆమె కోరుకున్న కొండలూ, ఆ కొండలలో సూర్యుడు, కొబ్బరిచెట్లూ, నీళ్లూ అన్నీ స్పష్టంగా ఆమెకు కనిపించేవి.

పాపకోసం తన చిన్నారి అనురాగాల రాశికోసం శేషయ్య తన రక్తాన్ని రంగుగా మార్చి, వేస్తున్న చిత్రం అది. పొద్దున్న పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పుడైతే అతడు చిత్రం గీస్తోంటే ఎవ్వరూ అడ్డుకోలేరు. పైగా విస్తరించేకొద్దీ విశాలంగా, దూరంగా జరిగి మరీ చోటిస్తున్నారు!

ఆ చిత్రంనుంచి 'రంగుల రాగం' ఒకటి రవళిస్తోంది! అది వినగలిగిన శక్తి ఒక్క హసితకే వుంది! ఆ రాగం ఆమెకే అంకితం!!

